# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!





### మళ్లా పైరవీకారుల కాలం అచ్చినట్లే..

చిట్యాల : కాంగ్రెసోళ్లు ధరణి తీసేస్తామంటే మళ్లా కార్యాలయాల చుట్టూ తిరగాల్సిందే. పైరవీకారుల కాలం అస్తది. ధరణి వల్లే భూములు భద్రంగా ఉన్నయ్. రైతుబంధు పడతాంది. అంతేకాకుండా అనుకోకుండా రైతు మరణిస్తే రూ.5 లక్షల బీమా వస్తున్నది. ఆ కుంటుంబానికి ఆసరా అవుతున్నది. ధరణిపోతే ఇవన్నీ ఎట్లా వస్తయ్, పట్టాదారు, అనుభవదారు, కబ్జాదారుల కాలం మళ్లీ తీసుకొస్తే గొడవలు పెరుగుతయ్. కాస్తులో ఉన్న రైతులపై పట్టాదారుల పెత్తనం కొనసాగుతుంది. పట్టాదారుగా రైతులు మార్చుకునేందుకు మళ్లీ ఆఫీసుల చుట్టూ చెప్పులు అరిగేలా తిరగాలి. పైరవీకారులకు పైసలియ్యాలె. మళ్లా ఎనకటి గోస పడాలె. అందుకే ధరణి, బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉండాలి.

**– ఎండీ మొయినుద్దీన్, అందుకుతండా, చిట్యాల**

### 10 హెచ్‌పీ మోటర్లతో ఎవుసం ఎట్ల చేత్తం



పలిమెల : 10 హెచ్‌పీ మోటర్లతో ఎవుసం ఎట్లా చేత్తం. కాంగ్రెసోళ్లు చెప్పినట్లు 10 హెచ్‌పీ మోటర్లు పెడితె ఎంత కరెంట్ కాలుతది. ఎంత బిల్లు వత్తది. పెట్టిన కూడా బోరు బావుల్లో నీళ్లు ఉండద్దా. కరెంట్ లోడు పెరిగి మోటర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతయ్. కాంగ్రెసోళ్లకు ఎన్నికలు రాగానే రైతులు గుర్తుకొత్తరు. గతంలో రైతులను పట్టించుకోలేదు. అప్పుడు కరెంట్ ఎప్పుడత్తదో తెలియక పోయేది. స్టాటర్ ఒత్తితేనే తెలిసేది. ఇప్పుడు 24 గంటల కరెంట్ వత్తాంది. కాంగ్రెసోళ్లను నమ్మి ఓటేత్తె మళ్లా కాలిన ట్రాన్స్‌ఫార్మర్లను గద్దెకు ఎక్కించుడు, దించుడు కథ మొదలైతది. కాంగ్రెస్ పాలన వద్దే వద్దు 24 గంటల కరెంట్ ఇస్తున్న సర్కారునే మళ్లీ గెలిపించుకుంటాం.

**–పడాల మల్లయ్య, పలిమెల**

### పాత కథలు చాలైతయ్..



కాటారం : ధరణి పోతె మళ్లీ పాత కథలే చాలైతయ్. గదే తిరుగుడు, గదే తినిపిచ్చుడు. చెప్పులరిగెదాంక తిరుగుడే ఉంటది. ధరణి వచ్చిందంటే ఎప్పుడంటే అప్పుడు మీ సేవ కేంద్రాలకు పోయి భూముల లెక్క సూసుకోవచ్చు. ఇంతకు ముందు ఇదంతా ఎక్కడిది. భూముల లెక్క జూడాలంటే చేతుల కొన్ని పైసలు పెట్టాలె. రమ్మన్నప్పుడు పోవాలె. దీని వల్ల నరకం జూసినం. ఇగ ఇప్పుడైతే రిజిస్ట్రేషన్ చేయించుకునుడు కూడా వీజీ అయిపోయింది. ఎమ్మార్వో ఆఫీస్‌లనే రిజిస్ట్రేషన్ జేసుకునుడు అందరికి సౌలత్ అయింది.

**– సుదాటి దేవేందర్, రైతు, గారెపల్లి, కాటారం**

### కాంగ్రెస్‌ను నమ్మితే చీకటే..



మహదేవపూర్ : గతంలో కరెంట్ కష్టాలతోటి ఆగమైనం. రాత్రింబవళ్లు బాయి కాడనే ఉండుడయ్యేది. లో వోల్టేజీ సమస్యతో మోటర్, ఫ్యూజులు కాలిపోయేది. పంటలకు నీళ్లు అందక ఎండిపోయేది. సీఎం కేసీఆర్ వచ్చినంకనే మా రైతుల కష్టాలు తీరినయ్. 24 గంటల ఉచిత కరెంట్, రైతు సంక్షేమ పథకాలతో సంతోషంగ ఎవుసం చేసుకుంటున్నం. మునుపటి కష్టాలు తప్పినయ్. కాంగ్రెస్ వస్తే 3 గంటల కరెంట్ ఇస్తామంటుండ్రు. 3 గంటలతో ఒక దొయ్యనన్న పారుతదా? గట్లయితే ఇగ పంటలు మొత్తం ఎండుడే అయితది. 10 హెచ్‌పీ మోటర్ పెట్టుకోవాలని చెబుతుండ్రు. అది సాధ్యమయ్యే పనేనా? అంత పెద్ద మోటర్లు పెడితే బాయిల కాడ ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతయ్. కాంగ్రెస్ ను నమ్మితే మళ్లా రైతులకు చీకటే. మేలు చేసే సీఎం కేసీఆర్ సార్ మళ్లా రావాలె.

**–ములకల్ల తిరుపతిరెడ్డి, సూరారం, మహదేవపూర్**



### కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెప్తం..

మహదేవపూర్ : గత పాలనలో ఎవుసం అంటెనే దుఃఖం అచ్చేది. సచ్చుకుంట, బతుక్కుంట ఎవుసం చేసినం. అరిగోస పడ్డం. సీఎం కేసీఆర్ వచ్చినంకనే మాకు కరెంట్ కష్టాలు తీరినయ్. కాంగ్రెస్ వస్తే 3 గంటల కరెంట్, 10 హెచ్‌పీ మోటర్ పెట్టాలంటుండ్రు. మూడు గంటల కరెంట్‌తో ఒక ఎకరం కూడ పారదు. ఇగ ఎవుసం ఎట్ల చెయ్యాలే. 10 హెచ్‌పీ మోటర్ పెడితే అది ఖర్చుతో కూడిన పని. ఒకవేళ పెట్టినా లోడ్ ఎక్కువై ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతయ్. రేవంత్‌రెడ్డి పూటకో మాట చెప్పుకుంట రైతులకు ఆయోమయానికి, ఆందోనళకు గురిచేత్తాండు. రేవంత్‌రెడ్డి మంచిగ ఉన్న ఎవుసాన్ని చూసి ఓర్వలేక నాశనం చేయడానికి కుట్ర పన్నుతున్నడు. వాళ్లను నమ్మితే మళ్లా పంటలు ఎండుడే. రైతులు మునుపుటి గోసలు మళ్లా పడుతరు. రైతు బాగుకోసం నిరంతరం ఆలోచన చేసే సీఎం కేసీఆర్ సార్ మళ్లా రావాలి. ఆయనతోనే మేలు జరుగుతది.

**–ఓడేటి రవీందర్ రెడ్డి, సూరారం, మహదేవపూర్**

### రికార్డులు మార్చి ముంచుతరు



కృష్ణకాలనీ : ధరణిని తీసేస్తే పట్వారీ వ్యవస్థ వస్తుంది. దీంతో భూ రికార్డులు మార్చి రైతులను నిలువునా ముంచుతరు. ధరణి వచ్చినంక మా భూములకు రక్షణ కలిగింది. మా భూములు ఎక్కడున్నయి ? ఎంత ఉన్నయి? అనేది సెల్ ఫోన్లలో చూసుకుంటున్నం. పాత పద్ధతి వస్తే పట్వారీలు పైసలు తీసుకొని కూడా అవసరానికి పత్రాలు ఇవ్వరు. పని ఇడిసిపెట్టుకొని రోజుల తరబడి తిరుగాల్సి వస్తుంది.

**– పెద్దిరెడ్డి సురేశ్‌రెడ్డి, శ్యామగడ్డ, జంగేడు, జయశంకర్ భూపాలపల్లి**

# ఎన్నికలకు సర్వం సిద్ధం

- **నియోజకవర్గంలో 2,26,366 ఓటర్లు**
- **303 పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు**
- **సమస్యాత్మక కేంద్రాల వద్ద పటిష్ట భద్రత**
- **ములుగు జిల్లా ఎన్నికల అధికారి ఇలా త్రిపాఠి**
- **పంపిణీ కేంద్రాన్ని పరిశీలించిన ఎన్నికల పరిశీలకుడు రత్నాకర్ ఝా**



ములుగు ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద ఎన్నికల సామగ్రిని సరి చూసుకుంటున్న అధికారులు

ములుగు రూరల్, నవంబర్ 29 : ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి ఇలా త్రిపాఠి తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా నేడు జరగబోయే పోలింగ్ కోసం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని ఆమె ఎన్నికల పరిశీలకుడు రత్నాకర్‌ఝాతో కలిసి పరిశీలించారు. అనంతరం రిటర్నింగ్ అధికారి అంకిత్‌తో కలిసి సిబ్బందికి పోలింగ్ సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ములుగు నియోజకవర్గ పరిధిలో 2,26,366 ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు 303 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేసినట్లు తెలిపారు. పంపిణీ కేంద్రాల్లో పోలింగ్ సామగ్రి పంపిణీ చేసేటప్పుడు, ఎన్నికల అనంతరం సామగ్రిని తిరిగి భద్రపర్చే సమయంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఓటర్ల కోసం తగిన ఏర్పాట్లు చేశామని, ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లకు అవసరమైన తాగునీరు, టాయిలెట్, ఇతర వసతులను కల్పించామని తెలిపారు. దివ్యాంగుల కోసం పోలింగ్ కేంద్రాల వద్ద అవసరమైన ర్యాంపులు, ట్రై సైకిళ్లు సిద్ధం చేశామన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత ఏర్పాట్లను చేసి అదనపు బలగాలను మోహరించామని తెలిపారు. అధిక శాతం పోలింగ్ నమోదయ్యేలా ఓటు హక్కు ప్రాముఖ్యతపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. నియోజకవర్గంలో అత్యధిక పోలింగ్ శాతం నమోదవుతుందని కలెక్టర్ ధీమా వ్యక్తం చేశారు. ఓటు వారి భవిష్యత్తును నిర్దేశిస్తుందని, ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా ప్రజలు ఆలోచించి స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. పోలింగ్ సామగ్రి పంపిణీలో అదనపు కలెక్టర్ డీ వేణుగోపాల్, డిప్యూటీ స్పెషల్ కలెక్టర్ డీఎస్ వెంకన్న, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, ఏఆర్వో విజయ్‌భాస్కర్, సంబంధిత అధికారులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.


నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

సెప్టిక్ ట్యాంక్ క్లినర్

★ సెప్టిక్ ట్యాంక్ క్లినర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043, 9866584455.

NTW-315036

WANTED

★ రామకృష్ణ గ్రూప్ (AP, న్యూఢిల్లీ No.1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషెంట్ల సేవకు ఇంటి/వంట పని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు 12/24 గంటల డ్యూటీ కొరకు కావలెను. ఏజెంట్లకు 5 వేలు కమీషన్. వృద్ధుల/పేషెంట్ల సేవకు వర్కర్లను 24x7 మీ ఇంటికి పంపగలము. 9281452762, 9515108830.

NT-314461

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
9182777213
WARANAGAL
9182777556
9182777557
9182777558
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777554
JANGAON
9182777565